15-05-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - స్మృతికి ఆధారము ప్రేమ, ప్రేమలో లోపము ఉన్నట్లయితే స్మృతి ఏకరసముగా ఉండదు మరియు స్మృతి ఏకరసముగా ఉండకపోతే ప్రేమ లభించదు"

ప్రశ్న:- ఆత్మకు అన్నింటికన్నా ప్రియమైన వస్తువు ఏమిటి? దానికి గుర్తు ఏమిటి?

జవాబు:- ఆత్మకు అన్నింటికన్నా ప్రియమైన వస్తువు ఈ శరీరము. ఈ శరీరముపై ఎంత ప్రేమ ఉందంటే, దానిని అది వదలాలనుకోదు. దానిని రక్షించుకునేందుకు ఎన్నో తయారీలు చేసుకుంటుంది. తండ్రి అంటారు - పిల్లలూ, ఇది తమోప్రధానమైన ఛీ-ఛీ శరీరము, మీరు ఇప్పుడు కొత్త శరీరాన్ని తీసుకోవాలి, అందుకే ఈ పాత శరీరము నుండి మమకారాన్ని తొలగించి వేయండి. ఈ శరీరము యొక్క భానము ఉండకూడదు, ఇదే మీ గమ్యము.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు. దైవీ స్వరాజ్యము యొక్క ప్రారంభోత్సవమైతే జరిగిపోయిందని ఇప్పుడు పిల్లలకు తెలుసు. ఇప్పుడు ఇక అక్కడకు వెళ్ళేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడైనా కొత్త శాఖను తెరిస్తే, ఎవరైనా పెద్ద వ్యక్తి ద్వారా దాని ప్రారంభోత్సవం చేయించేందుకు ప్రయత్నిస్తారు. పెద్ద వ్యక్తులను చూసి క్రింది ఆఫీసర్లు మొదలైనవారంతా వస్తారు. ఉదాహరణకు గవర్నరు వస్తే పెద్ద-పెద్ద మినిస్టర్లు మొదలైనవారు కూడా వస్తారు. మీరు ఒకవేళ కలెక్టరును పిలిస్తే అంత పెద్ద వ్యక్తులెవ్వరూ రారు. అందుకే అందరికన్నా పెద్దవారెవరినైనా తీసుకువచ్చేందుకు ప్రయత్నించడం జరుగుతుంది. ఏదో ఒక సాకుతో లోపలికి వస్తే, మీరు వారికి - అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వం ఎలా లభిస్తుంది అనే దారిని చూపగలుగుతారు. ఇది బ్రాహ్మణులైన మీకు తప్ప ఇతర మనుష్యులెవరికీ తెలియదు. అయితే, భగవంతుడు వచ్చేసారు అని కూడా డైరెక్టుగా చెప్పకూడదు. భగవంతుడు వచ్చేసారు అని కూడా ఎంతోమంది చెప్తూ ఉంటారు కానీ అలా చెప్పకూడదు, ఇలా తమను తాము భగవంతునిగా చెప్పుకునే వారైతే ఎంతోమంది ఉన్నారు. అందుకే ఎలా అర్థం చేయించాలంటే - అనంతమైన తండ్రి వచ్చి, కల్పపూర్వము వలె, డ్రామా ప్లాన్ అనుసారంగా అనంతమైన వారసత్వాన్ని ఇస్తున్నారు అని. ఈ మొత్తం లైన్ అంతటినీ వ్రాయవలసి ఉంటుంది. మనుష్యులు అలా వ్రాసింది చదువుతారు, ఇక ఆపై ఎవరి భాగ్యంలో ఉంటే వారు ప్రయత్నం చేస్తారు. మనం అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటున్నామని పిల్లలైన మీకు తెలుసు కదా. ఇక్కడికైతే నిశ్చయబుద్ధి కల పిల్లలే వస్తారు. నిశ్చయబుద్ధి కలవారు కూడా మళ్ళీ ఏదో ఒక సమయంలో సంశయబుద్ధి కలవారిగా అయిపోతారు. మాయ ఓడించేస్తుంది, నడుస్తూ-నడుస్తూ ఉండగా ఓడిపోతారు. అయినా, ఎప్పుడూ ఒక వైపే గెలుపు ఉండడం, ఓటమనేది లేనే లేకపోవడమనేది నియమము కూడా కాదు. గెలుపు, ఓటములు రెండూ ఉంటూ ఉంటాయి. యుద్ధములో కూడా మూడు రకాల వారుంటారు - ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ మరియు థర్డ్ క్లాస్. అప్పుడప్పుడూ యుద్ధం చేయనివారు కూడా చూడడానికి వస్తారు. వారిని కూడా రానివ్వడం జరుగుతుంది. కాస్త రంగు అంటుకుని, వారు కూడా ఈ సైన్యంలోకి వస్తారేమోనని భావిస్తారు. మీరు మహారథీ యోధులని ప్రపంచానికి తెలియదు. కానీ మీ చేతిలో ఆయుధాలు మొదలైనవేవీ లేవు. మీ చేతిలో ఆయుధాలు మొదలైనవి శోభించవు కూడా. కానీ జ్ఞానమనే ఖడ్గము అని తండ్రి అర్థం చేయిస్తారు కదా, దానిని వారు స్థూలంగా భావించారు. పిల్లలకు తండ్రి జ్ఞానము యొక్క అస్త్ర-శస్త్రాలను ఇస్తారు, ఇందులో హింస యొక్క విషయమేమీ లేదు. కానీ ఇది అర్థం చేసుకోరు. దేవీలకు స్థూలమైన ఆయుధాలు మొదలైనవాటిని ఇచ్చేసారు. వారిని కూడా హింసకులుగా చేసేసారు, ఇది పూర్తిగా తెలివితక్కువతనం. ఎవరెవరు పుష్పాలుగా అవ్వనున్నారు అనేది తండ్రికి బాగా తెలుసు. పుష్పాలు ముందు ఉండాలని తండ్రి స్వయమే చెప్తారు. ఫలానావారు తప్పకుండా పుష్పముగా అవ్వనున్నారు. బాబా పేర్లు చెప్పరు, లేదంటే మిగిలినవారు - మేమేమైనా ముళ్ళగా అవుతామా అని అంటారు! నరుని నుండి నారాయణునిగా ఎవరు అవుతారని బాబా అడిగితే, అందరూ చేతులెత్తుతారు. ఆ మాటకొస్తే ఎవరైతే ఎక్కువ సేవ చేస్తారో వారు తండ్రిని కూడా స్మృతి చేస్తారని స్వయానికే అర్థమవుతుంది. తండ్రిపై ప్రేమ ఉంటే, వారి స్మృతి కూడా ఉంటుంది. ఏకరసముగానైతే ఎవ్వరూ స్మృతి చేయలేరు. స్మృతి చేయలేకపోతారు కాబట్టే ప్రేమ లేదు. ప్రియమైన వస్తువునైతే ఎంతగానో స్మృతి చేయడం జరుగుతుంది. చిన్న పిల్లలు ప్రియంగా ఉంటారు కావున తల్లిదండ్రులు తమ ఒడిలోకి తీసుకుంటారు. చిన్న పిల్లలు కూడా పుష్పాలే. శివబాబా వద్దకు వెళ్ళాలని ఏ విధముగా పిల్లలైన మీకు మనసు కలుగుతుందో, అలా చిన్నపిల్లలు కూడా ఆకర్షిస్తారు, వెంటనే ఆ పిల్లలను ఎత్తుకుని ఒడిలో

కూర్చోబెట్టుకుంటారు మరియు ప్రేమను ఇస్తారు.

ఈ అనంతమైన తండ్రి అయితే చాలా ప్రియమైనవారు. వారు అన్ని శుభమైన మనోకామనలనూ పూర్తి చేస్తారు. మనుష్యులకు ఏమి కావాలి? ఒకటేమో ఆరోగ్యం బాగుండాలి, ఎప్పుడూ రోగగ్రస్థులుగా అవ్వకూడదని కోరుకుంటారు. అన్నింటికన్నా మంచిది ఈ ఆరోగ్యము. ఆరోగ్యం బాగుండి, ధనం లేకపోతే ఆ ఆరోగ్యం కూడా ఏమి ఉపయోగపడుతుంది? మళ్ళీ ధనం కావాలి, దాని ద్వారా సుఖం లభిస్తుంది. తండ్రి అంటారు, మీకు ఆరోగ్యం, సంపద, రెండూ తప్పకుండా లభించనున్నాయి. ఇది కొత్త విషయమేమీ కాదు, ఇది చాలా-చాలా పాత విషయం. మీరు ఎప్పుడెప్పుడైతే కలుసుకుంటారో, అప్పుడు ఇలాగే చెప్తారు. అంతేకానీ లక్షల సంవత్సరాలు లేక పదమాల సంవత్సరాల క్రితమని అనరు. ఈ ప్రపంచం కొత్తగా ఎప్పుడు అవుతుంది, మళ్ళీ పాతగా ఎప్పుడు అవుతుంది అనేది మీకు తెలుసు. ఆత్మలమైన మనం కొత్త ప్రపంచంలోకి వెళ్తాము, మళ్ళీ పాత ప్రపంచంలోకి వస్తాము. మీకు ఆల్రౌండర్ అన్న పేరు పెట్టడం జరిగింది. మీరు ఆల్రౌండర్లని తండ్రి అర్థం చేయించారు. పాత్రను అభినయిస్తూ-అభినయిస్తూ ఇప్పుడు అనేక జన్మల అంతిమంలోకి వచ్చి చేరుకున్నారు. మొట్టమొదట ప్రారంభములో మీరు పాత్రను అభినయించడానికి వస్తారు. అది స్వీట్, సైలెన్స్ హోమ్ (మధురమైన, నిశ్శబ్దమైన ఇల్లు). మనుష్యులు శాంతి కొరకు ఎంతగా హైరానా పడతారు. మేము శాంతిధామంలో ఉండేవారము, మళ్ళీ అక్కడి నుండే పాత్రను అభినయించడానికి వచ్చాము అని అర్థం చేసుకోరు. పాత్ర పూర్తయింది, మళ్ళీ ఎక్కడి నుండైతే వచ్చామో అక్కడికి తప్పకుండా వెళ్తాము. అందరూ శాంతిధామం నుండి వస్తారు. అందరి ఇల్లు ఆ బ్రహ్మలోకము, బ్రహ్మాండము, అక్కడ ఆత్మలన్నీ ఉంటాయి. రుద్రుడిని కూడా అండాకారములో అంత పెద్దగా తయారుచేస్తారు. ఆత్మ చాలా చిన్నగా ఉంటుంది అని వారికి తెలియదు. నక్షత్రము వలె ఉంటుంది అని అంటారు కూడా, కానీ పూజ పెద్దగా ఉన్న రూపానికే జరుగుతుంది. ఇంత చిన్నని బిందువుకైతే పూజ చేయడం వీలవ్వదని మీకు తెలుసు. మరి దేనికి పూజ చేయాలి, అందుకే పెద్ద రూపాన్ని తయారుచేస్తారు మరియు పూజిస్తారు, పాలతో అభిషేకం చేస్తారు. వాస్తవానికైతే ఆ శివుడు అభోక్త, మరి వారిపై పాలు ఎందుకు పోస్తారు? పాలు తాగినట్లయితే వారు భోక్తగా అయిపోతారు. ఇది కూడా ఒక విచిత్రమే. వారు మాకు వారసుడు మరియు మేము వారికి వారసులము ఎందుకంటే మేము వారిపై బలిహారమయ్యాము అని అందరూ అంటారు. ఏ విధంగా తండ్రి పిల్లలపై బలిహారమై మొత్తం ఆస్తినంతటినీ వారికి ఇచ్చేసి స్వయం వానప్రస్థంలోకి వెళ్ళిపోతారో, అలాగే ఇక్కడ కూడా బాబా వద్ద మనము ఎంతైతే జమ చేసుకుంటామో అదంతా సురక్షితమైపోతుందని మీరు భావిస్తారు. కొందరిది ధూళిలో కూరుకుపోతుంది... అన్న గాయనం కూడా ఉంది. ఏదీ మిగలదని, అంతా భస్మమైపోనున్నదని పిల్లలైన మీకు తెలుసు. విమానాలు పడిపోయి వినాశనం జరిగితే దొంగలకు సంపద లభిస్తుందని కూడా అనుకోకండి, ఎందుకంటే ఆ దొంగలు మొదలైనవారంతా కూడా అంతమైపోతారు. ఆ సమయంలో దొంగతనాలూ మొదలైనవి కూడా సమాప్తమైపోతాయి. మామూలుగానైతే విమానాలు పడిపోతే మొట్టమొదట ఆ సంపదంతా దొంగల చేతుల్లోకి వస్తుంది, అప్పుడు అక్కడ ఆ అడవులలోనే ఆ సంపదను దాచి పెట్టేస్తారు, ఒక్క సెకండులో పని అంతా కానిచ్చేస్తారు. అనేక రకాల దొంగతనాల పనులు చేస్తారు, కొందరు రాయల్టీతో, కొందరు రాయల్టీ లేకుండా చేస్తూ ఉంటారు. ఇదంతా వినాశనమైపోతుందని మరియు మీరు మొత్తం విశ్వానికి యజమానులుగా అవుతారని మీకు తెలుసు. మీకు ఎక్కడా ఏమీ వెతకవలసిన అవసరం రాదు. మీరు చాలా ఉన్నతమైన ఇంటిలో జన్మ తీసుకుంటారు. ధనం యొక్క అవసరమే లేదు. రాజులకు ఎప్పుడూ ధనం తీసుకోవాలన్న ఆలోచన కూడా ఉండదు. దేవతలకైతే అస్సలు ఉండదు. తండ్రి మీకు అంతా ఎంతగా ఇస్తారంటే ఇక ఎప్పుడూ దొంగతనం, ఈర్ష్య మొదలైనవాటి విషయమే ఉండదు. మీరు పూర్తిగా పుష్పముగా అయిపోతారు. ముళ్ళు మరియు పుష్పాలు ఉన్నాయి కదా. ఇక్కడంతా ముళ్ళే ముళ్ళులా ఉన్నారు. ఎవరైతే వికారాలు లేకుండా ఉండనే ఉండలేకపోతారో, వారిని తప్పకుండా ముళ్ళు అనే అనవలసి ఉంటుంది. రాజుల నుండి ప్రజల వరకు అందరూ ముళ్ళగానే ఉన్నారు. అందుకే బాబా అంటారు, నేను మిమ్మల్ని ఈ లక్ష్మీ-నారాయణుల వలె తయారుచేస్తాను అనగా రాజులకే రాజులుగా తయారుచేస్తాను. ఈ ముళ్ళు పుష్పాల ఎదురుగా వెళ్ళి తల వంచుతారు. ఈ లక్ష్మీ-నారాయణులైతే వివేకవంతులు కదా. సత్యయుగము వారిని మహారాజులు అని, త్రేతాయుగము వారిని రాజులు అని అంటారని కూడా తండ్రి అర్థం చేయించారు. గొప్ప వ్యక్తులను మహారాజులని, తక్కువ సంపాదన కలవారిని రాజులని అంటారు. మహారాజుల దర్బారు మొదట జరుగుతుంది. పదవులైతే ఉంటాయి కదా. కుర్చీలు కూడా నంబరువారుగా లభిస్తాయి. రారు అనుకున్న వారెవరైనా వచ్చేస్తే, అప్పుడు కూడా ముందు వారికి కుర్చీ ఇవ్వడం జరుగుతుంది. గౌరవం ఇవ్వవలసి ఉంటుంది.

మన మాల తయారవుతుందని మీకు తెలుసు. ఇది కూడా పిల్లలైన మీ బుద్ధిలోనే ఉంది, ఇంకెవ్వరి బుద్ధిలోనూ ఇది

లేదు. రుద్రమాలను తీసుకొని తిప్పుతూ ఉంటారు. మీరు కూడా తిప్పేవారు కదా. అనేక మంత్రాలను జపించేవారు. తండ్రి అంటారు, అది కూడా భక్తియే. ఇక్కడైతే ఒక్కరినే స్మృతి చేయాలి మరియు తండ్రి విశేషముగా అంటారు - మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలూ, భక్తి మార్గములో దేహాభిమానము కారణముగా మీరు అందరినీ స్మృతి చేసేవారు, ఇప్పుడు ఇక నన్నొక్కరినే స్మృతి చేయండి. ఒక్క తండ్రి లభించారు కావున లేస్తూ-కూర్చుంటూ ఆ తండ్రిని స్మృతి చేయండి, అప్పుడు ఎంతో సంతోషం కలుగుతుంది. తండ్రిని స్మృతి చేయడం ద్వారా మొత్తం విశ్వము యొక్క రాజ్యాధికారము లభిస్తుంది. సమయం ఎంత తక్కువవుతూ ఉంటే అంత త్వరత్వరగా స్మృతి చేస్తూ ఉంటారు. దినప్రతిదినమూ అడుగులు ముందుకు వేస్తూ ఉంటారు. ఆత్మ ఎప్పుడూ అలసిపోదు. శరీరముతో ఏదైనా పర్వతము పైకి ఎక్కితే అలసిపోతారు. తండ్రిని స్మృతి చేయడంలో మీకు ఎటువంటి అలసటా కలగదు, సంతోషములో ఉంటారు. తండ్రిని స్మృతి చేస్తూ ముందుకు వెళ్తూ ఉంటారు. అర్ధకల్పం పిల్లలు శాంతిధామంలోకి వెళ్ళడానికి కష్టపడ్డారు. లక్ష్యము, ఉద్దేశ్యము గురించి ఏమీ తెలియదు. పిల్లలైన మీకైతే పరిచయం ఉంది. భక్తి మార్గములో ఎవరి కొరకైతే ఇవన్నీ చేసారో, వారు అంటున్నారు - ఇప్పుడు నన్ను స్మృతి చేయండి. బాబా చెప్తుంది కరక్టా కాదా మీరే ఆలోచించండి. వారైతే నీటి ద్వారానే పావనముగా అయిపోతారని భావిస్తారు. నీరైతే ఇక్కడ కూడా ఉంది. ఇదేమైనా గంగ నీరా? కాదు, ఇది వర్షం ద్వారా వొగైన నీరు, ఇది జలపాతాల నుండి వస్తూనే ఉంటుంది, దీనిని గంగ నీరని అనరు. ఇది ఎప్పుడూ ఆగిపోదు - ఇది కూడా సృష్టి అద్భుతము. వర్షం ఆగిపోతుంది కానీ నీరు వస్తూనే ఉంటుంది. వైష్ణవులు ఎప్పుడూ బావిలోని నీటినే తాగుతారు. ఒకవైపేమో అది పవిత్రమైనదని భావిస్తారు, మరోవైపేమో పతితుల నుండి పావనులుగా అయ్యేందుకు గంగలో స్నానాలు చేయడానికి వెళ్తారు. దీనిని అజ్ఞానమనే అంటారు. వర్షపు నీరైతే బాగానే ఉంటుంది, దీనిని కూడా డ్రామా అద్భుతము అని అంటారు. ఇది ఈశ్వరీయ ప్రకృతి సిద్ధమైన అద్భుతము. బీజము ఎంత చిన్నది, దాని నుండి ఎంత పెద్ద వృక్షము వెలువడుతుంది. భూమి బంజరు భూమిలా అయిపోతే ఇక అందులో శక్తి ఉండదని, రుచి కూడా ఉండదని మీకు తెలుసు. స్వర్గము ఎలా ఉంటుంది అనేదంతా పిల్లలైన మీకు తండ్రి ఇక్కడే అంతా అనుభవం చేయిస్తారు. ఇప్పుడైతే స్వర్గము లేదు. డ్రామాలో ఇది కూడా నిశ్చితమై ఉంది. పిల్లలకు సాక్షాత్కారమవుతుంది. అక్కడి ఫలాలు మొదలైనవన్నీ ఎంత బాగా మధురంగా ఉంటాయి - మీరు ట్రాన్స్ లో చూసి ఇక్కడకు వచ్చి వినిపిస్తారు. ఇప్పుడు ఏవైతే సాక్షాత్కారములో చూస్తారో, వాటిని అక్కడకు వెళ్ళినప్పుడు ఈ కనుల ద్వారా చూస్తారు, నోటితో తింటారు. ఏవైతే సాక్షాత్కారాలలో చూస్తారో, వాటన్నింటినీ ఈ కనులతో చూస్తారు, ఇక ఆ తర్వాత పురుషార్థముపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ పురుషార్థమే చేయకపోతే ఏ పదవిని పొందుతారు? మీ పురుషార్థము జరుగుతోంది, మీరు ఈ విధంగా అవుతారు. ఈ వినాశనం తర్వాత ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉంటుంది. ఇది కూడా ఇప్పుడు తెలిసింది. పావనముగా అవ్వడంలోనే సమయం పడుతుంది. స్మృతియాత్ర ముఖ్యమైనది. సోదరీ-సోదరులుగా భావించడం ద్వారా కూడా కొందరిలో మార్పు రాకపోవడం (పాత అలవాట్లు మారకపోవడం) గమనించడం జరిగింది. కావున ఇప్పుడు ఇక సోదరులుగా భావించండి అని చెప్తారు. సోదరీ-సోదరులుగా భావించడం ద్వారా కూడా దృష్టి భ్రమించదు, కానీ సోదరులుగా చూడడం ద్వారా అసలు శరీరమే ఉండదు. మనమందరమూ ఆత్మలము, శరీరాలము కాము. ఇక్కడ ఏదైతే కనిపిస్తుందో అదంతా వినాశనమైపోతుంది. ఈ శరీరాన్ని వదిలి మీరు అశరీరిగా అయి వెళ్ళాలి. మేము ఈ శరీరాన్ని వదిలి ఎలా వెళ్ళాలి అన్నది నేర్చుకోవడానికే మీరు ఇక్కడకు వస్తారు. ఇదే గమ్యము కదా. శరీరము అనేది ఆత్మకు ఎంతో ప్రియమైనది. శరీరము వదలకుండా ఉండేందుకు ఆత్మ ఎన్ని ఏర్పాట్లు చేసుకుంటుంది. నా ఈ శరీరము వదిలి పోకూడదని భావిస్తుంది. ఆత్మకు ఈ శరీరముపై చాలా-చాలా ప్రేమ ఉంది. తండ్రి అంటారు, ఇదైతే పాత శరీరము. మీరు కూడా తమోప్రధానముగా ఉన్నారు, మీ ఆత్మ అశుద్ధముగా ఉంది, అందుకే దుఃఖితులుగా, రోగగ్రస్తులుగా అవుతూ ఉంటారు. తండ్రి అంటారు, ఇప్పుడు ఈ శరీరముపై ప్రేమను ఉంచుకోకూడదు. ఇది పాత శరీరము. ఇప్పుడు మీరు ఇక కొత్తదానిని కొనుక్కోవాలి. అలాగని కొనుక్కునేందుకు దుకాణం అంటూ ఏదీ లేదు. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే పావనులుగా అయిపోతారు, ఇక అప్పుడు శరీరము కూడా మీకు పావనమైనదే లభిస్తుంది. పంచ తత్వాలు కూడా పావనముగా అయిపోతాయి. తండ్రి అన్ని విషయాలను అర్థం చేయించి, మళ్ళీ మన్మనాభవ అని అంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శివబాబాకు మనము వారసులము, వారు మనకు వారసుడు, ఈ నిశ్చయముతో తండ్రిపై పూర్తిగా

బలిహారమవ్వాలి. ఎంతగా బాబా వద్ద జమ చేసుకుంటారో, అంతగా అది సురక్షితమవుతుంది. కొందరిది ధూళిలో కూరుకుపోతుంది... అని అంటూ ఉంటారు.

2. ముళ్ళ నుండి పుష్పాలుగా ఇప్పుడే తయారవ్వాలి. ఏకరసమైన స్మృతి మరియు సేవ ద్వారా తండ్రి ప్రేమకు అధికారులుగా అవ్వాలి. దినప్రతిదినము స్మృతిలో అడుగులు ముందుకు వేస్తూ ఉండాలి.

వరదానము:- మీ పురుషార్థపు విధిలో స్వయము యొక్క ప్రగతిని అనుభవము చేసుకునే సఫలతా సితార భవ

ఎవరైతే తమ పురుషార్థపు విధిలో స్వయము యొక్క ప్రగతిని మరియు సఫలతను అనుభవము చేస్తారో, వారే సఫలతా సితారలు. వారి సంకల్పములో స్వయము యొక్క పురుషార్థము పట్ల కూడా ఎప్పుడూ ''అవుతుందో లేదో తెలియదు'', ''చెయ్యగలమో లేక చెయ్యలేమో తెలియదు'' అన్న ఇటువంటి అసఫలత యొక్క అంశము కూడా ఉండదు. స్వయము పట్ల సఫలతను అధికారము రూపములో అనుభవము చేస్తారు. అటువంటివారికి సహజంగా మరియు స్వతహాగా సఫలత లభిస్తూ ఉంటుంది.

స్లోగన్:- సుఖ స్వరూపులుగా అయ్యి సుఖాన్ని ఇచ్చినట్లయితే పురుషార్థములో ఆశీర్వాదాలు కలుస్తూ ఉంటాయి.